


మోకాస కలవపూడి సొసైటీ త్రిసభ్య కమిటీ ఇదే

ప్రజాశక్తి - మండవల్లి


కమిటీని అభినందిస్తున్న నేతలు

మోకాస కలవపూడి ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం నూతన ఛైర్మన్‌గా అట్లూరు వెంకటేశ్వరావు నియమితులయ్యారు. నూతనంగా నియమించిన త్రిసభ్య కమిటీలో డైరెక్టర్లుగా కూనపరెడ్డి శ్రీనివాసరావు, వరద శివ నాగేశ్వరరావు ఉన్నారు. ఈ సందర్భంగా ఛైర్మన్ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ కోఆపరేటివ్ సొసైటీని రైతులకు మరింత చేరువ చేస్తానన్నారు. మోకాస కలవపూడి సహకార బ్యాంకును మరింత అభివృద్ధి పథంలో నడిపిస్తానని తెలిపారు. ఈ అవకాశం కల్పించిన నేతలకు, ప్రజాప్రతినిధులకు, ఎంఎల్ఎకు కృతజ్ఞతలు తెలిపారు.


పోలవరం వద్ద గోదావరి ఉధృతి


కుక్కునూరు-దాచారం మధ్య నీట మునిగిన కాజ్‌వే

వరద గోదావరి

కుక్కునూరు-దాచారం మధ్య గుండేటి వాగుపై కాజ్‌వే మునక

12 గ్రామాలకు నిలిచిన రాకపోకలు

స్పిల్ వే నుండి 5,02,478క్యూసెక్కుల జలాలు విడుదల

జిల్లా కలెక్టరేట్, జంగారెడ్డిగూడెం ఆర్‌డిఒ, వేలేరుపాడు, కుక్కునూరుల్లో కంట్రోల్‌రూమ్‌ల ఏర్పాటు

ప్రజాశక్తి - కుక్కునూరు రూరల్

ఎగువ రాష్ట్రాల్లో కురుస్తున్న భారీ వర్షాలు, ప్రాజెక్టుల్లో సామర్థ్యానికి మించి ఉన్న నీటిని గేట్లు తెరిచి దిగువకు వదలడంతో గోదావరికి వరద ఉధృతి పెరుగుతుంది. భద్రాచలంలో గురువారం 27 అడుగులు ఉన్న నీటిమట్టం శుక్రవారం 36.6 అడుగులకు చేరుకుంది. దీంతో కుక్కునూరు-దాచారం మధ్య గుండేటి వాగుపై కాజ్‌వేపైకి గోదావరి వరద నీరు ముంచెత్తడంతో వాగు అవతల ఉన్న దాచారం, బెస్తగూడెం, సీతారామపురం, నెమలిపేట, ఉప్పర మద్దిగట్ల, అరవపల్లి, గొమ్ముగూడెం, లచ్చిగూడెం తదితర 12 గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. ఆయా గ్రామాల ప్రజలు మండల కేంద్రమైన కుక్కునూరు రావాలంటే చుట్టూ 15 కిలోమీటర్లు తిరిగి రావాల్సిన దుస్థితి ఏర్పడింది. గోదావరి వరద అంతకంతకు పెరుగుతుండటంతో మండల ప్రజలు, రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు.


వేలేరుపాడు మండలం నుంచి సురక్షిత ప్రాంతాలకు సామాన్లతో తరలుతున్న జనం

వరద ప్రభావిత ప్రాంతాల్లో ఐటిడిఎ పిఒ పర్యటన

గోదావరి వరద ముంపు ప్రభావిత ప్రాంతాలైన లచ్చిగూడెం, గొమ్ముగూడెం గ్రామాల్లో ఐటిడిఎ పిఒ రాములు నాయక్ శుక్రవారం పర్యటించారు. గ్రామస్తులతో సమావేశమయ్యారు. దాచారం ఆర్అండ్ఆర్ కాలనీలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రానికి తరలివెళ్లాలని సూచించారు. పిఒ వెంట తహశీల్దార్ కె.రమేష్‌బాబు పాల్గొన్నారు.


వేలేరుపాడు-కొయిదా నడుమ ఎద్దువాగు పొంగి కాజ్‌వే నీట మునగడంతో బోటుపై రాకపోకలు సాగిస్తున్న జనం

దాచారం పునరావాస కేంద్రంలో విద్యుత్ సౌకర్యం ఏర్పాటు

దాచారం ఆర్అండ్ఆర్ కాలనీలో వరద బాధితుల పునరావాస కేంద్రంలో విద్యుత్ సౌకర్యం కల్పించినట్లు ఎపిఇపిడిసిఎల్ ఎస్ఇ పి.సాల్మన్‌రాజు తెలిపారు. శుక్రవారం దాచారంలోని పునరావాస కేంద్రాన్ని ఆయన సందర్శించారు. బాధితులకు ఆహార పదార్థాలు తయారుచేసే వంటశాలకు, పునరావాస కేంద్రంలో విద్యుత్ సౌకర్యం కల్పించామన్నారు. జనరేటర్‌ను కూడా అందుబాటులో ఉంచామన్నారు.

వేలేరుపాడు రూరల్: గోదావరి వరద అనూహ్యంగా పెరుగుతుండటంతో మండలంలోని ప్రజలు తీవ్ర భయాందోళనకు గురవుతున్నారు. మండలంలోని రుద్రంకోట, రేపాకగొమ్ము ప్రాంతాల ప్రజలు ముందు జాగ్రత్తగా చల్లావారిగూడెం ఆర్అండ్ఆర్ కాలనీ, నెమలిపేట ఆర్అండ్ఆర్ కాలనీకి తరలివెళ్తున్నారు. ఆటోలు, ట్రాక్టర్లపై తమ సామగ్రిని సొంత ఖర్చులతో చేరవేసుకుంటున్నారు. గోదావరి ఉగ్రరూపంతో మండలంలోని వేలేరుపాడు నుంచి కోయిదా వెళ్లే మార్గంలోని ఎద్దువాగు కాజ్‌వే మునిగిపోవడంతో సిద్ధారం, టేకూరు, ఎడవల్లి, కోయిదా, కట్కూరు తదితర సుమారు 18 గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. దీంతో ఆ గ్రామాల్లోని ప్రజలకు బాహ్య ప్రపంచంతో సంబంధాలు తెగిపోయి నానావస్థలు పడుతున్నారు. మండల కేంద్రమైన వేలేరుపాడులో శుక్రవారం వారపు సంతకు వచ్చేవారు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. బోటుపై కాజ్‌వే దాటాల్సి రావడంతో రవాణాఛార్జీలు పెరిగిపోయాయని పలువురు ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు స్పందించి ఆయా గ్రామాల ప్రజలకు నిత్యావసర సరుకులు, బియ్యం సరఫరా చేయడంతోపాటు జనరేటర్లు అందించాలని కోరుతున్నారు.

పోలవరం: పోలవరంలో గోదావరి నీటిమట్టం శుక్రవారం సాయంత్రానికి అనూహ్యంగా పెరిగింది. పోలవరం ప్రాజెక్టు స్పిల్వేలోకి చేరుకున్న 5,02,478 క్యూసెక్కుల అదనపు జలాలను అధికారులు దిగువకు విడుదల చేశారు. స్పిల్వే ఎగువన 30.110 మీటర్లు, దిగువన 20.870 మీటర్లు, ఎగువ కాపర్ డ్యామ్‌కు ఎగువన 30.500 మీటర్లు, దిగువ కాపర్ డ్యామ్‌కు దిగువన 20.280 మీటర్లు, ఎగువ, దిగువ కాపర్ డ్యామ్‌ల మధ్య 15.860 మీటర్లు నీటిమట్టం నమోదైంది. ప్రాజెక్ట్ దిగువన నీటిమట్టం 9 మీటర్లుగా నమోదైందని సిడబ్ల్యుసి అధికారులు తెలిపారు.

అధికార యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలి: కలెక్టర్ వెట్రిసెల్వి

ఏలూరు: భద్రాచలం వద్ద గోదావరికి శనివారం మొదటి ప్రమాద హెచ్చరిక జారీ చేసే అవకాశం ఉన్నందున అధికార యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ కె.వెట్రిసెల్వి ఆదేశించారు. ప్రమాద హెచ్చరిక జారీ చేసిన వెంటనే ముంపు ప్రభావిత ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని జంగారెడ్డిగూడెం ఆర్‌డిఒను కలెక్టర్ ఆదేశించారు. గోదావరికి వరద ఉధృతి దృష్ట్యా ప్రజలెవ్వరూ నదిలోకి వెళ్లొద్దని, ఈతకు వెళ్లడం, చేపలు పట్టడం వంటివి చేయొద్దని అన్నారు. ప్రసవ సమయానికి దగ్గరలో ఉన్న గర్భిణులను సమీప సామాజిక ఆరోగ్య కేంద్రాలకు తరలించాలని, ముంపు ప్రాంత గర్భిణులు, వృద్ధులు, పిల్లలు, విభిన్న ప్రతిభావంతులను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని అన్నారు. అవసరమైన టార్పాలిన్లు సిద్ధం చేయాలన్నారు. జిల్లాస్థాయిలో 18002331044 నెంబర్‌తో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామని, కుక్కునూరు, వేలేరుపాడు మండల కేంద్రాల్లోనూ కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశారని తెలిపారు. దాచారం ఆర్అండ్ఆర్ కాలనీలో వరద పునరావాస కేంద్రం ఏర్పాటు చేసి, నిర్వాసితులకు భోజన వసతి సౌకర్యాలు కల్పించాలని, వైద్య శిబిరాలను కూడా ఏర్పాటు చేయాలని అన్నారు. పునరావాస కేంద్రంలో తాగునీరు, మరుగుదొడ్ల సౌకర్యం కల్పించాలని, వాటర్ ట్యాంకర్లు సిద్ధం చేయాలన్నారు. మోటార్ బోట్లు, గత ఈతగాళ్లను సిద్ధంగా ఉంచాలన్నారు.


పునరావాస కేంద్రానికి తరలిరావాలని గొమ్ముగూడెం వాసులను కోరుతున్న ఐటిడిఎ పిఒ, తహశీల్దార్


సార్వాలోనూ సాగునీటి కష్టాలు

శివారు భూములకు నీరందక పాట్లు

ఎండుతున్న నారుమళ్లు, నాట్లు

ప్రజాశక్తి - ఆచంట

సార్వా సాగు ఆరంభంలోనే సాగునీటి కష్టాలు మొదలయ్యాయి. ఒకపక్క గోదావరికి వరదొస్తున్నా పక్కనే ఉన్న పంట భూములకు చుక్కనీరు అందని దుస్థితి. వర్షాలు లేకపోవగా ఎండల తీవ్రత ఎక్కువగా ఉండటం, మరోపక్క సాగునీరు అందక ఆచంట నియోజకవర్గంలో నారుమడులు ఎండిపోతున్నాయి. కాలువల్లో నీటిమట్టాలు పడిపోవడంతో నాట్లు వేసేందుకు అనువుగా దమ్ములు చేసే పరిస్థితీ కన్పించడం లేదు. పంట బోదెలు పూడుకుపోవడం, ప్రధాన కాల్వల నుంచి పిల్ల కాలువలకు పూర్తిస్థాయిలో నీరు విడుదల కాకపోవడంతో చేలు శివారు భూములకు నీరందడం లేదు. దీంతో కొందరు రైతులు ఆయిల్ ఇంజిన్లు అద్దెకు తెచ్చుకుని బోదెల్లోని నీటిని తోడుకుంటూ నారుమడులను రక్షించుకుంటున్నారు. దీంతో నాట్లు సాగడం లేదు. దీంతో సార్వా సాగు ఆలస్యమవుతుందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కాల్వలకు నీరొదిలి సుమారు 40 రోజులు కావొస్తున్నా పంట కాలువల్లో నీళ్లు మాత్రం పుష్కలంగా ఉండని పరిస్థితి. తక్షణమే అధికారులు స్పందించి పూర్తిస్థాయిలో సాగునీరు అందించాలని రైతులు ముక్తకంఠంతో కోరుతున్నారు.


చిన్నమల్లంలో నీరందక ఎండుతున్న నారుమళ్లు


దమ్ములకు నీరు లేకపోవడంతో ఎండిపోతున్న పొలాలు

బోదెల్లో నీరేదీ..



పెనుగొండ అయ్యప్ప, కౌలురైతు, చినమల్లం

పంట బోదెల్లో నీళ్లు సరిగా పారడం లేదు. దీంతో నారుమళ్లు ఎండిపోతున్నాయి. సాలు దమ్ములు కూడా చేయలేకపోతున్నాం. సరిగా వర్షాలు లేకపోవడంతో నారుమళ్లు ఎండిపోతున్నాయి. కాలువల్లో నీటిమట్టాలు సక్రమంగా ఉండేలా చూడాల్సిన అధికారులు పట్టించుకోవడం లేదు.

ఇంజిన్లతో నీళ్లు తోడుకుంటున్నాం..



కుడిపూడి శ్రీనివాస్, కౌలు రైతు, , చిన్నమల్లం

ఇంజిన్లతో నీళ్లు తోడుకుని నారుమళ్లను రక్షించుకుంటున్నాం. పది రోజుల్లో నాట్లు వేయాల్సి ఉన్నా ఇప్పటికీ సాలు దమ్ములు చేసేందుకు కూడా నీరందడం లేదు. నారుమడుల సమయంలో నీటిఎద్దడి ఏర్పడితే రానున్న రోజుల్లో పరిస్థితి ఏమిటీ. కాల్వల శివారు భూములకు నీరు సక్రమంగా అందకపోవడంతో ఆయిల్ ఇంజిన్లు ఉపయోగించుకోవాల్సి వస్తుంది. తక్షణమే అధికారులు స్పందించాలి.

ఉద్యాన శాఖ పథకాలపై అవగాహన కల్పించాలి

జెసి పి.ధాత్రిరెడ్డి

ప్రజాశక్తి - కామవరపుకోట

ఉద్యాన శాఖ ద్వారా అమలవుతున్న వివిధ పథకాలు రైతుసేవా కేంద్రాల ద్వారా ప్రతి రైతుకూ చేరాలని జాయింట్ కలెక్టర్ పి.ధాత్రిరెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం తడికలపూడి గ్రామంలో ఉద్యాన పంటలను ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా ఆయిల్‌పామ్, కొబ్బరి తోటల్లో సాగు చేస్తున్న బహుళ, అంతర పంట విధానాన్ని, ఉద్యాన యాంత్రీకరణలో ఉడ్ చిప్పర్, చాప్ కట్టర్ పనితీరును పరిశీలించారు. ఎన్ఆర్ఇజిఎస్ ద్వారా నేల తేమ పరిరక్షణ పద్ధతులను పాటించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ఉద్యాన అధికారి ఎస్.రామ్మోహన్, ఉద్యాన సహాయ సంచాలకులు, మండల ఉద్యాన అధికారులు, గ్రామ ఉద్యాన సహాయకులు, ఉద్యాన రైతులు హాజరయ్యారు.


రైతులు, అధికారులతో మాట్లాడుతున్న జెసి

మాదకద్రవ్యాల నివారణకు చర్యలు

పెద రైల్వే

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

కమిటీని అభినందిస్తున్న నేతలు


మాట్లాడుతున్న అదనపు ఎస్‌పి నక్క సూర్యచంద్రరావు

జిల్లాలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా, మాదకద్రవ్యాలు జిల్లాలోకి చేరకుండా ఉండేందుకు ప్రత్యేక చర్యలలో భాగంగా రైళ్లను గత కొద్దిరోజులుగా తనిఖీలు చేస్తున్నామని జిల్లా అదనపు ఎస్‌పి నక్క సూర్యచంద్రరావు అన్నారు. రైళ్లలో మాదకద్రవ్యాల రవాణా నిరోధించేందుకే ఈ ప్రత్యేక చర్యలు చేపట్టామని ఆయన తెలిపారు. ఏలూరు నగరంలోని ఏలూరు పెద్ద రైల్వే స్టేషన్‌లో శుక్రవారం మధ్యాహ్నం రెండువైపులా తనిఖీలు నిర్వహించారు. అనంతరం సూర్యచంద్రరావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మాదకద్రవ్యాల నిరోధకానికి ఈగల్ టీంను ప్రత్యేకంగా ఏర్పాటు చేసిందని, వీటి పని కేవలం జిల్లాలోకి, రాష్ట్రంలోకి మాదకద్రవ్యాలు చేరకుండా ఉండేందుకు చర్యలు తీసుకోవడమేనని తెలియజేశారు. ఇందులో భాగంగానే గంజాయి వంటి మాదకద్రవ్యాలు ఇతర రాష్ట్రాల నుంచి రైళ్లలో ఆంధ్రప్రదేశ్‌కు చేరుతున్నాయన్న పక్కా సమాచారంతో రైళ్లలో తనిఖీలు చేపడుతున్నామన్నారు. ముఖ్యంగా ఒరిస్సా, ఛత్తీస్‌ఘడ్, బీహార్ వంటి రాష్ట్రాల నుంచి వలస కూలీలు ఇక్కడికి వస్తూ.. కొంత గంజాయిని నగరానికి తెస్తూ ఇక్కడ ఉన్న విద్యార్థులను, యువతను మాదకద్రవ్యాలకు బానిసలుగా చేస్తున్నారన్నారు. ఈవిధంగా పలు జిల్లాల్లో జరిగిందని, మన జిల్లాలో కూడా అలా జరిగేందుకు అవకాశాలున్న నేపథ్యంలో ఈ తనిఖీలు చేపడుతున్నామని ఆయన తెలియజేశారు. ఈ తనిఖీలు జిఆర్‌పి పోలీసులు, రైల్వే ప్రొటెక్షన్ పోలీసులు, లాండర్ పోలీసులు సంయుక్తంగా నిర్వహించాలని తెలిపారు. ఈ తనిఖీలలో జిఆర్‌పి ఎస్ఐ సైమన్, ఎఆర్ఆర్ ఎస్ఐ ఉదయ్ భాస్కర్, హెడ్ కానిస్టేబుల్ సూర్యచక్ర, ఆర్‌పిఎఫ్ పోలీసులు సిబ్బంది పాల్గొన్నారు.

ప్రతిఒక్కరూ మొక్కలు నాటాలి

యుటిఎఫ్ నాయకులు పద్మ కిషోర్, రాంబాబు

ప్రజాశక్తి - ముసునూరు

ముందు తరాలకు ప్రాణవాయువు పరిరక్షించేందుకు ప్రతి ఒక్కరూ ఒక మొక్క నాటాలని యుటిఎఫ్ నాయకులు జి.పద్మ కిషోర్, గుడిమెళ్ల రాంబాబు పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని చెక్కపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 200 మంది విద్యార్థులకు మొక్కలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు షేక్ అల్లాబక్షు మాట్లాడుతూ మొక్కలను మనం పెంచితే అవి మన ప్రాణాన్ని రక్షించే జీవ వాయువుని అందిస్తాయని, పర్యావరణాన్ని కాపాడటంలో దోహద పడతాయని, ప్రతి ఒక్కరూ విధిగా మొక్కలు నాటి వాటిని రక్షించే బాధ్యత తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఇన్‌ఛార్జి ప్రధానోపాధ్యాయిని శివనాగమణి, సీనియర్ ఉపాధ్యాయులు పొదిల అబ్రహం, రుక్మిణి పాల్గొన్నారు.


విద్యార్థికి మొక్కను అందజేస్తున్న యుటిఎఫ్ నాయకులు

అర్హులందరికీ 'తల్లికి వందనం'

ఎంఎల్ఎ చింతమనేని ప్రభాకర్

ప్రజాశక్తి - దెందులూరు

అర్హులైన ప్రతి ఒక్కరికి తల్లికి వందనం పథకం లబ్ధి చేకూరేలా సంబంధిత అధికారులు చర్యలు చేపట్టాలని దెందులూరు ఎంఎల్ఎ చింతమనేని ప్రభాకర్ తెలిపారు. సంక్షేమ పథకాల అమలుపై దుగ్గిరాలలోని క్యాంపు కార్యాలయంలో ఎంఎల్ఎ సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ మాట్లాడుతూ రాష్ట్రంలోని అర్హులైన ప్రతి ఒక్క పేదవాడికి కూడా ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు అందేలా చేయడమే కూటమీ ప్రభుత్వ లక్ష్యమని, అయితే గత వైసిపి ప్రభుత్వంలో చేసిన కొన్ని అస్తవ్యస్త విధానాల వల్ల అలాగే విధివిధానాలు లేకుండా ఇష్టానుసారం చేసినటువంటి మ్యాపింగ్లు వంటి సమస్యల వల్ల ఎంతోమంది అర్హులైన పేదలకు ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు చేరటం లేదని తెలిపారు. గత వైసిపి ప్రభుత్వంలో ప్రజలకు ఉన్న సమస్యలను పరిష్కరించకుండా అనర్హులను వారి వివరాలను తారుమారు చేసి వారికి అక్రమంగా లబ్ధి చేకూర్చేలా చేయడం పట్లే వైసిపి నాయకులు దృష్టి సారించారని, దీనివల్ల నిజమైన అర్హులు కూడా ఎంతోమంది ఇబ్బందులు పడ్డారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా అమలు చేసిన తల్లికి వందనం పథకం నియోజకవర్గంలో అర్హులైన ఎంతో మంది తల్లులకు ఇప్పటికే వారి బ్యాంకు అకౌంట్లో డబ్బు జమ చేయడం జరిగిందని, అయితే సాంకేతిక కారణాలవల్ల నిజమైన అర్హత కలిగి ఉండి కూడా తల్లికి వందనం పథకం అందుకోని తల్లులను గుర్తించి అందించేలా చర్యలు చేపట్టడం జరిగిందన్నారు. ఈ విషయంలో అధికారులు, సచివాలయ సిబ్బంది ప్రత్యేక చొరవ చూపి కృషిచేయాలని తెలిపారు. ఈ సమీక్ష సమావేశంలో జిల్లా డిఆర్‌డిఎ ప్రాజెక్టు డైరెక్టర్, దెందులూరు నియోజకవర్గ స్పెషల్ ఆఫీసర్ విజయరాజు సహా పలువురు ఉన్నతాధికారులు, పలు మండలాల తహశీల్దార్‌లు, ఎంపిడిఒలతోపాటు సంబంధిత సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

డిగ్రీలో డ్యూయల్ మేజర్ విధానాన్ని కొనసాగించాలి

ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యాన విద్యార్థుల ధర్నా

ప్రజాశక్తి - ఏలూరు

డిగ్రీలో డ్యూయల్ మేజర్ విధానాన్ని కొనసాగించాలని ఏలూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ముందు ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యాన విద్యార్థులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి కె.లెనిన్ మాట్లాడుతూ రోజుకో మాట పూటకో విధానంలా ఉన్నత విద్యామండలి తీరు ఉందన్నారు. డ్యూయల్ డిగ్రీ విధానం అమలు చేస్తున్నామని ఉత్తర్వులు ఇచ్చి తిరిగి రివ్యూ జరిపి సింగిల్ మేజర్ విధానం కొనసాగిస్తామనడం హాస్యాస్పదం అన్నారు. గత ప్రభుత్వ విధానాలను నిలదీసిన విద్యాశాఖ మంత్రి లోకేష్ నేడు అదే బాటలో అడుగులు వేస్తున్నారని గుర్తుచేశారు. ఇష్టానుసారంగా నెలకో నిర్ణయం చేయడం విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడటమే అని దుయ్యబట్టారు. గత నిర్ణయానికి అనుగుణంగా డిగ్రీలో డ్యూయల్ మేజర్ కొనసాగించాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా ఇంటర్న్‌షిప్ భారాన్ని తగ్గించి, మైనర్ సబ్జెకు క్రెడిట్ పాయింట్స్ పెంచాలని కోరారు. విద్యార్థి చదువుకు తగ్గట్టుగా ఇంటర్న్‌షిప్ ఇవ్వాలని, ఇంటర్న్‌షిప్ చేస్తున్న సందర్భంలో విద్యార్థులకు తగిన స్టైఫండ్ ఇచ్చే విధంగా సంబంధిత పరిశ్రమలతో ఒప్పందం చేసుకోవాలన్నారు. ముఖ్యంగా ఇంటర్న్‌షిప్ చేస్తున్న ప్రాంతాలలో విద్యార్థులకు భద్రత ఉండేలా చర్యలు చేపట్టాలన్నారు. ఇంటర్ పరీక్షల ఫలితాలు వెలవడి మూడు నెలలు గడుస్తున్నా ఇంత వరకూ అడ్మిషన్ల ప్రక్రియను ప్రారంభించకపోవడం దుర్మార్గమన్నారు. రోజురోజుకి డిగ్రీలో చేరే వారి సంఖ్య తగ్గుముకం పడుతున్న నేపథ్యంలో ఉన్నత విద్యామండలి వైఖరి డిగ్రీ విద్యను మరింత వెనక్కినెట్టే విధంగా ఉందని ఆవేదన వ్యక్తంచేశారు. ఆఫ్‌లైన్ పద్ధతిన డిగ్రీ అడ్మిషన్లు ప్రారంభించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన బాట పడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నగర కమిటీ సభ్యులు శివాజీ, శివ, రాజబాబు, జయంత్, అభి, మీనాక్షి, నందిని, రమ్య పాల్గొన్నారు.

పిల్లల పట్ల అజాగ్రత్త తగదు

ఎంపిపి రామిశెట్టి సత్యనారాయణ

ప్రజాశక్తి - ముదినేపల్లి

అంగన్వాడీ పిల్లల పట్ల అజాగ్రత్త వహించరాదని ఎంపిపి రామిశెట్టి సత్యనారాయణ అన్నారు. మండలంలోని గురజ అంగన్వాడీ కేంద్రాన్ని శుక్రవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా అంగన్వాడీ కేంద్రంలో పిల్లలకు, గర్భిణులకు అందిస్తున్న పౌష్టికాహారం వివరాలను అడిగి తెలుసుకున్నారు. పౌష్టికాహారం అందించేటప్పుడు తీసుకోవలసిన జాగ్రత్తలపై సిబ్బందికి ఆయన వివరించారు. పిల్లల ఆరోగ్యం పట్ల తీసుకోవాల్సిన పలు విషయాలను అంగన్వాడీ సిబ్బందికి తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధికారుల ప్రతినిధి మొట్రూ ఏసుబాబు, మండల పరిషత్ వైస్ ఎంపిపి-2 రాచురి రాధ, నియోజకవర్గ వాణిజ్య విభాగ అధ్యక్షులు రాచురి కుమార్, కలిదిండి మాజీ ఎఎంసి వైస్ ఛైర్మన్ బత్తిన కిషోర్, మీసాల రామకృష్ణ, గ్రామ అధ్యక్షులు మామిడపల్లి రంగరావు, పుట్టి సుబ్బారావు, రాచురి గణేష్ కుమార్ పాల్గొన్నారు.


వివరాలు తెలుసుకుంటున్న ఎంపిపి

నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు

ఎస్ఐ పవన్ కుమార్

ప్రజాశక్తి - పోలవరం

ప్రతి ఆటో డ్రైవర్ లైసెన్స్, వాహన ఇన్సూరెన్స్, ఫిట్‌నెస్ ధ్రువీకరణ పత్రాలు తప్పనిసరిగా కలిగి ఉండాలని ఎస్ఐ పవన్‌కుమార్ సూచించారు. మండల కేంద్రంలోని శ్రీచైతన్య ఆటో యూనియన్ సభ్యులతో పోలవరం ఎస్ఐ పవన్ కుమార్ శుక్రవారం మత్తు పదార్థాలపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ మద్యం సేవించి వాహనం నడపడం వల్ల ప్రమాదాలు జరుగుతాయని, అటువంటి చర్యలు చట్టరీత్యా శిక్షార్హమని హెచ్చరించారు. రాత్రి సమయంలో అనుమానాస్పదంగా సంచరించే వ్యక్తులు లేదా ఆటోల ద్వారా మత్తు పదార్థాలు(సారా, గంజాయి) రవాణా చేయడాన్ని తాము గమనిస్తే కఠినంగా వ్యవహరిస్తామని తెలిపారు. అటువంటి చర్యల గురించి సమాచారం ఉంటే వెంటనే పోలీసులకు తెలియజేయాలని సూచించారు. ప్రజల భద్రత కోసం డ్రైవర్ల సహకారం ఎంతో అవసరమని ఎస్ఐ పవన్ కుమార్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆటో ప్రెసిడెంట్ తాళ్లపూడి చంద్రరావు, కోశాధికారి కొత్తపల్లి నాగరాజు, ఆటో యూనియన్ కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికుల ధర్నా

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

మున్సిపాల్టీ, కార్పొరేషన్లలో పని చేస్తున్న కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఇంజినీరింగ్ ఉద్యోగులు, కార్మికులకు సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలని కోరుతూ ఎఐటియుసి ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక జిల్లా కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. ఈ ధర్నానుద్దేశించి ఎఐటియుసి జిల్లా అధ్యక్షులు రెడ్డి శ్రీనివాస్‌డాంగే, ఎపి మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి భజంత్రీ శ్రీనివాస్, ది జోనల్ మున్సిపల్ ఎంప్లాయిస్ యూనియన్ కార్యదర్శి ఎ.అప్పలరాజు మాట్లాడుతూ మున్సిపాలిటీ, కార్పొరేషన్‌లో పని చేస్తున్న ఇంజినీరింగ్ కార్మికులు, వివిధ విభాగాల్లో పని చేస్తున్న కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు చెల్లించే జీతభత్యాల్లో చాలా వ్యత్యాసాలు ఉన్నాయని అన్నారు. అందరికీ సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలని వారు డిమాండ్ చేశారు. ఎన్నికల ముందు కూటమి ఇచ్చిన హామీలు అమలు చేయాలని కోరారు. సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 15న చలో విజయవాడ నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో ఆ సంఘం జిల్లా ఉపాధ్యక్షులు బండి వెంకటేశ్వరరావు మాట్లాడగా నేతలు పుప్పాల కన్నబాబు, పోలా భాస్కరరావు, నారాయణరావు తదితరులు పాల్గొన్నారు. ధర్నా అనంతరం డిఆర్ఒ విశ్వేశ్వరరావుకు వినతిపత్రం సమర్పించారు.



ధర్నా చేస్తున్న కార్మికులు

తాగునీరు అందజేయాలి

ఎంపిడిఒ బసవరాజు అచ్యుత సత్యనారాయణ

ప్రజాశక్తి - ముసునూరు

తాగునీరు అందజేయాలని గ్రామస్థాయి అధికారులను ఎంపిడిఒ బసవరాజు అచ్యుత సత్యనారాయణ, డిఎల్‌డిఒ వెంకటరత్నం ఆదేశించారు. తాగునీటి సమస్యను పరిష్కరించాలని కోరుతూ రమణక్కపేట సచివాలయంలో ధర్నా నిర్వహించగా ప్రజాశక్తిలో వచ్చిన కథనానికి స్పందించిన మండల శాఖ, జిల్లా శాఖ అధికారులు శుక్రవారం మండలంలోని రమణక్కపేట గ్రామంలో దళిత వాడలో హ్యాండ్ పంపు రిపేరు చేసి, వాటర్ ట్యాంకర్ల ద్వారా నీటి సప్లై చేయటం విధానంపై పరిశీలించారు. తాగునీరు అందజేయాలని గ్రామస్థాయి అధికారులను ఆదేశించారు.

అతిథి అధ్యాపకుల భర్తీకి దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి - కుక్కునూరు

మండలంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అర్థశాస్త్రం సబ్జెక్టుకు సంబంధించిన అతిథి అధ్యాపక పోస్టు ఖాళీగా ఉంది. పీజీ ఎకనామిక్స్‌లో కనీసం 50 శాతం మార్కులతో ఉత్తీర్ణులైన అభ్యర్థులు ఈనెల 15వ తేదీ (మంగళవారం) సాయంత్రం 5 గంటలలోపు కళాశాలలో దరఖాస్తులను సమర్పించాలని ప్రిన్సిపల్ కె.శ్రీనివాసరావు తెలిపారు. ఇంటర్వ్యూలు ఈనెల 17వ తేదీ ఉదయం 10 గంటల నుంచి నిర్వహించబడతాయని ఆయన ఒక ప్రకటనలో వెల్లడించారు.

బుట్టాయగూడెం : ప్రభుత్వ జూనియర్ కళాశాల బుట్టాయగూడెంలో 2025-26 విద్యా సంవత్సరంలో నూతనంగా ప్రవేశపెట్టిన సిఎస్ఇ(కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్) ఒకేషనల్ కోర్సుకు గెస్ట్ ఫ్యాకల్టీ నుంచి అభ్యర్థనలు స్వీకరించబడుతున్నాయి. బీటెక్ కంప్యూటర్, ఎంసిఎ లేదా ఎంఎస్‌సి కంప్యూటర్స్ చేసిన వారు ఈనెల 15 లోపు కాలేజీకి వచ్చి అప్లికేషన్ ఇవ్వాలి. 16న కాలేజీ ఆవరణలో ఇంటర్వ్యూ నిర్వహించబడుతుంది.

పోలవరం : ఇంటర్ బోర్డు కమిషనర్ ఉత్తర్వులు, డిఇఒ ఆదేశాల మేరకు మండలంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఖాళీగా ఉన్న తెలుగు అధ్యాపకుల పోస్టును గెస్ట్ అధ్యాపకునిగా భర్తీ చేయనున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ కె.సజిని శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ గుర్తింపు పొందిన విశ్వవిద్యాలయాల నుంచి ఎంఎ తెలుగులో కనీసం 50 శాతం మార్కులు సాధించిన అభ్యర్థులు ఈ పోస్టుకు దరఖాస్తు చేసుకోవడానికి అర్హులని పేర్కొన్నారు. ఆసక్తిగల అభ్యర్థులు ఈనెల 15వ తేదీ సాయంత్రం 4 గంటలలోపు కళాశాల కార్యాలయంలో తమ దరఖాస్తులను సమర్పించాలని సజిని తెలియజేశారు.

రేషన్ దుకాణం ప్రారంభం

జంగారెడ్డిగూడెం : పట్టణంలోని స్థానిక బాట గంగానమ్మ లేఅవుట్ కాలనీలో శనివారం రేషన్ దుఖాణాన్ని ప్రారంభించారు. ఆ ప్రాంతంలో సుమారు 500 కుటుంబాలు 15 సంవత్సరాలుగా నివసిస్తున్నారు. వారు రేషన్ సరుకుల కోసం సుమారు 5 కిలోమీటర్లు వెళ్లి తెచ్చుకోవడానికి చాలా ఇబ్బందులు పడుతున్నామని, గత ఐదేళ్ళ వాహనాల ద్వారా ఇంటింటికీ ఇస్తానని చెప్పి, ఒక్క దగ్గర పెట్టి పోసేవారని, రేషన్ వాహనం ఎప్పుడు వస్తుందో తెలియక వాహనం కోసం పనులు మానుకుని పడిగాపులు కాసామని వాపోయారు. ఇప్పుడు మళ్లీ పాత పద్ధతిలో రేషన్ షాపు వద్దనే ఇవ్వడం వల్ల పనులు మానకుండా 1వ తేదీ నుంచి 15వ తేదీ లోపు తెచ్చుకుంటున్నామని, 60 సం.లపైబడిన వృద్ధులకు కూడా ఇంటికి తెచ్చి రేషన్ సరుకులు ఇస్తున్నారన్నారు. ఇప్పుడు స్థానిక నాయకులు నీరుకొండ రాము ద్వారా పట్టణ అధ్యక్షులు కొండ్రెడ్డి కిషోర్, సీనియర్ నాయకులు గుమ్మడి ప్రసాద్‌తో కలిసి ఎంఎల్ఎ దృష్టికి తీసుకు వెళ్లగా వెంటనే స్పందించి తహశీల్దార్‌కు చెప్పి, రేషన్ దుకాణం ఏర్పాటు చేశారని హర్షం వ్యక్తం చేశారు. రేషన్ దుకాణం ఏర్పాటు చేసినందుకు ఎంఎల్ఎతో వీడియో కాల్‌లో మాట్లాడుతూ వారికి ధన్యవాదాలు తెలిపారు.

మాజీ ఎంఎల్ఎ ప్రసన్నకుమార్ రెడ్డిపై ఫిర్యాదు

నూజివీడు టౌన్ : మాజీ ఎంఎల్ఎ ఎన్.ప్రసన్నకుమార్ రెడ్డి వ్యాఖ్యలను ఖండిస్తూ నూజివీడు పట్టణ టిడిపి మహిళా నాయకులు, కార్యకర్తల ఆధ్వర్యంలో నూజివీడు పట్టణ పోలీస్ స్టేషన్లో మహిళలు ఫిర్యాదు చేశారు. గతవారం నెల్లూరు జిల్లా కోవూరులో జరిగిన వైసిపి విస్తృత స్థాయి సమావేశంలో మాజీ ఎంఎల్ఎ ఎన్.ప్రసన్నకుమార్ రెడ్డి శాసన సభ్యురాలు ప్రశాంతి రెడ్డిపై చేసిన వ్యాఖ్యలు ఖండిస్తూ పట్టణ పోలీసు స్టేషన్లో ఫిర్యాదు చేశారు. ప్రసన్న కుమార్ రెడ్డిపై క్రిమినల్ చర్యలు తీసుకోవాల్సిందిగా డిమాండ్ చేశారు. మహిళల ప్రతిష్ట దిగజారేలా వ్యాఖ్యలు చేయడం సిగ్గుచేటన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు, మాజీ కౌన్సిలర్ గోలు దుర్గాదేవి, లక్ష్మీ సాధన, మండల తెలుగు మహిళ అధ్యక్షురాలు లత, సునీత, నజీమా, పట్టణ మహిళా నాయకురాలు కె.కృష్ణకుమారి, జనసేన నాయకురాలు ఉమామహేశ్వరి పాల్గొన్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయాలి

ఎఐఎస్‌ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎం.సాయికుమార్

నూజివీడు టౌన్ : ఎఐఎస్‌ఎఫ్ రాష్ట్ర సమితి పిలుపులో భాగంగా శుక్రవారం పెండింగ్లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను విడుదల చేయాలని, అదేవిధంగా జిఒ నెంబర్ 77 రద్దు చేయాలని, 300 మంది విద్యార్థులను కలుపుకొని సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా కార్యక్రమం నిర్వహించారు. అనంతరం సబ్ కలెక్టర్ బచ్చు స్మరణ్‌రాజ్‌కి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎఐఎస్‌ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎం.సాయికుమార్, జిల్లా అధ్యక్షులు డి.శివకుమార్ మాట్లాడారు. బకాయిలు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఎఐఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్షులు డి.శివకుమార్, జిల్లా కోశాధికారి ఎం.క్రాంతి, కుమార్ పాల్గొన్నారు.

కూలి రేట్లు పెంచాలని వినతి

ఏలూరు అర్బన్ : ఏలూరు నగరంలో మర్చంట్ ఛాంబర్ పరిధిలో దిగుమతులు, ఎగుమతులు చేసే హమాలి కార్మికులకు కూలి రేట్లు పెంపుదలలో స్థానిక ఎంఎల్ఎ జోక్యం చేసుకోవాలని కోరుతూ ఎఐటియుసి, ఐఎఫ్‌టియు ఆధ్వర్యంలో శుక్రవారం ఏలూరు వైఎంహెచ్‌ఎ హాలు నుంచి ఎంఎల్ఎ క్యాంపు కార్యాలయం వరకు ప్రదర్శన చేపట్టారు. ఈ సందర్భంగా క్యాంపు కార్యాలయం వద్ద ఎంఎల్ఎ బడేటి చంటి బయటకు వచ్చి కార్మిక సంఘ ప్రతినిధులు ఇచ్చిన వినతిని తీసుకుని సమస్య పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఎఐటియుసి జిల్లా నాయకులు బండి వెంకటేశ్వరరావు, ఐఎఫ్‌టియు జిల్లా ప్రధాన కార్యదర్శి బుద్దా వెంకట్రావు పాల్గొన్నారు.

నేరాలు - ఘోరాలు

ఆకతాయిలకు కౌన్సెలింగ్

ఏలూరు స్పోర్ట్స్ : ఈవ్ టీజర్లకు శక్తి టీం ప్రతిరోజు చెక్ పెడుతూనే ఉంది. అందులో భాగంగానే శుక్రవారం కూడా ఏలూరు ఆర్ఆర్ పేట ప్రాంతంలోని కళాశాలల ప్రాంగణంలో విద్యార్థులను ఇబ్బంది పెడుతున్న ఇద్దరు టీజర్లను పట్టుకొని రెండో పట్టణ పోలీస్ స్టేషన్లో శక్తి టీమ్ అప్పగించింది. ప్రతిరోజూ శక్తి టీం కళాశాల ప్రాంగణాలలో విజిబుల్ పోలీసింగ్ నిర్వహిస్తూ ఉంది. శుక్రవారం సాయంత్రం కూడా వారు విజిబుల్ పోలీసింగ్ నిర్వహిస్తున్న సమయంలో ఇద్దరు ఆకతాయిలు విద్యార్థులను ఇబ్బందులకు గురిచేస్తున్నట్లు గుర్తించారు. వెంటనే వారిని అదుపులోకి తీసుకుని రెండో పట్టణ ఎస్ఐ మధు వెంకటరాజుకు అప్పగించారు. మధు వెంకటరాజు వారికి పూర్తిస్థాయిలో కౌన్సెలింగ్ ఇచ్చి పంపించారు. మరో మారు ఇటువంటి చర్యలకు పాల్పడితే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

కలప, టేకు అక్రమ రవాణా

అడ్డుకున్న అటవీశాఖ అధికారులు

వేలేరుపాడు రూరల్ : వసంతవాడ గ్రామం వద్ద ఎపి 37 టికె 0275 వ్యాన్‌లో శుక్రవారం సాయంత్రం అక్రమంగా టేకు, కలప తరలివెళ్తుండడంతో వసంతవాడ గ్రామానికి చెందిన యువకులు వ్యానును అడ్డగించి అటవీ శాఖ అధికారులకు సమాచారం అందించారు. సంఘటన స్థలానికి చేరుకున్న అటవీశాఖ అధికారులు వసంతవాడ గ్రామ సమీపంలో వ్యాన్‌తో సహా కలపను కుక్కునూరు అటవీ రేంజ్ శాఖ కార్యాలయానికి తరలించారు. ఈ కలప వ్యాను ఎవరిదో తెలుసుకుని వారిపై అటవీ శాఖ రేంజర్ కృష్ణమూర్తి, సెక్షన్ ఆఫీసర్ పెరుమాళ్ళు, బీట్ ఆఫీసర్ ధనలక్ష్మి ఉన్నారు.

ఆటోలో బ్యాగ్ మర్చిపోయిన విద్యార్థిని..

ఏలూరు స్పోర్ట్స్ : కళాశాల నుంచి ఇంటికి ఆటోలో వెళుతున్న విద్యార్థిని తన వెంట తెచ్చుకున్న బ్యాగును ఆటోలో మరచిపోయింది. దీనిపై మూడో పట్టణ పోలీసులకు ఆమె ఫిర్యాదు చేసింది. ఫిర్యాదు అందుకున్న గంట సేపట్లోనే పోలీసులు ఆటోను గుర్తించి తిరిగి ఆమె బ్యాగ్‌ను ఆమె వద్దకు చేర్చారు. ఏలూరు మూడో పట్టణ సిఐ కోటేశ్వరరావు తెలిపిన వివరాల ప్రకారం ఏలూరు నగరంలోని మహిళా డిగ్రీ కళాశాలలో పామర్తి వెంకట కృష్ణవేణి అనే విద్యార్థిని డిగ్రీ చదువుతుంది. శుక్రవారం తన కళాశాల తరగతులు అనంతరం తన ఇంటికి వెళ్లేందుకు ఆటో ఎక్కి బయలుదేరింది. ఆమె కొత్త బస్టాండ్ వద్ద ఆటో దిగింది. అనంతరం ఆటో వెళ్లిపోయింది. వెంటనే ఆమె చూసుకునేసరికి తన బ్యాగును ఆటోలో వదిలేసినట్లు గుర్తించింది. వెంటనే మూడో పట్టణ సిఐ కోటేశ్వరరావుకు ఫిర్యాదు చేసింది. ఫిర్యాదు అందుకున్న వెంటనే కోటేశ్వరరావు అక్కడ స్థానికంగా ఉన్న సీసీ కెమెరాలు తనిఖీ చేసి ఆటోను గుర్తించారు. వెంటనే ఆటో డ్రైవర్ వద్ద ఉన్న బ్యాగును తిరిగి ఆమెకు అప్పగించారు. గంట వ్యవధిలో తన బ్యాగును తనకు అప్పగించిన మూడో పట్టణ పోలీసులకు కృష్ణవేణి కృతజ్ఞతలు తెలిపింది.

నాణ్యమైన విద్యాబోధనే లక్ష్యం

పది ఫలితాల్లో నూరు శాతం ఉత్తీర్ణత

ప్రిన్సిపల్ కె.లక్ష్మీకుమారి

ప్రజాశక్తి - ముసునూరు



తమ పాఠశాలలో ఐదో తరగతి నుంచి పదో తరగతి వరకు నాణ్యమైన విద్యాబోధన అందిస్తున్నామని ముసునూరు గురుకుల పాఠశాల ప్రిన్సిపల్ కె.లక్ష్మీకుమారి అన్నారు. పదో తరగతి పరీక్ష ఫలితాల్లో నూటికి నూరు శాతం ఉత్తీర్ణత సాధించడమే కాకుండా ట్రిపుల్ ఐటీలో సీట్లు సాధించిన ఘనత తమ పాఠశాల విద్యార్థుల సొంతమన్నారు. ఈ సందర్భంగా ఆమె ప్రజాశక్తితో మాట్లాడారు. షైనింగ్ స్టార్స్ అవార్డులు సైతం తమ విద్యార్థులు సాధించారన్నారు. తమ పాఠశాలలో చదివే విద్యార్థులు రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పరీక్షల్లో విజయం సాధించి ర్యాంకుల ద్వారా సీట్లు పొందుతున్నారన్నారు. తమ పాఠశాలలో చదివిన విద్యార్థులు విదేశాల్లో ఉద్యోగాలు చేస్తున్నారని చెప్పారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివితే నెలనెలా ఫీజులు కట్టక్కర్లేదన్నారు. ఆహ్లాదకరమైన వాతావరణం, విశాలమైన తరగతి గదులు, చక్కని ఆటస్థలం తమ పాఠశాల సొంతమన్నారు. విద్యార్థులకు ఆరోగ్యాన్ని చేకూర్చే పోషక విలువలతో కూడిన మధ్యాహ్న భోజనం అదేవిధంగా విద్యార్థులకు ప్రత్యేక తరగతుల నిర్వహణ చర్యలు తీసుకుంటామన్నారు. ప్రతి విద్యార్థికి యూనిఫామ్, ఉచిత పుస్తకాలు, నోటు పుస్తకాలు అందజేయడంతో పాటు సైన్స్ పట్ల అవగాహన కల్పించడానికి, ప్రతి విద్యార్థి ప్రయోగాలు చేయించడానికి ప్రత్యేకమైన సైన్సు లాబరేటరీలు, ఉన్నత విద్యార్హతలు కలిగిన ఉపాధ్యాయులతో ఉత్తమమైన విద్యాబోధన ఉంటుందన్నారు. విద్యార్థులందరికీ ప్రతినెలా ప్రభుత్వం వైద్యులచే ఆరోగ్య పరీక్షలు నిర్వహించి, ఉచిత మందులు పంపిణీ చేస్తుందని, బాలికలలో రక్తహీనత తగ్గించడం కోసం ప్రతినెల రక్తపరీక్షలు నిర్వహించి, ప్రతి గురువారం ఐరన్ టాబ్లెట్లు పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. విద్యార్థులందరికీ నులుపురుగుల నివారణ కోసం ప్రతి ఆరు నెలలకు ఒకసారి మాత్రల పంపిణీ చేయించడం జరుగుతుందని, 5వ తరగతి నుంచి పదవ తరగతి వరకు ఇంగ్లీష్ మీడియంలో విద్యాబోధన ఉంటుందన్నారు. ప్రభుత్వ గురుకుల పాఠశాలలో చదివిన ప్రతి విద్యార్థికి తల్లికి వందనం పథకంలో భాగంగా సంవత్సరానికి రూ.15 వేలు ఆర్థిక సహాయం లభిస్తుందన్నారు. ప్రతి తరగతి గదిలో అధునాతనమైన సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన ఇంటర్నెట్ సదుపాయంతో కూడిన డిజిటల్ క్లాసులు నిర్వహించటం, విద్యార్థులందరికీ ఆర్వో ప్లాంట్ ద్వారా పరిశుభ్రమైన మినరల్ వాటర్ అందిస్తున్నట్లు చెప్పారు. తమ పాఠశాలలో ప్రతి పరీక్ష నిర్వహించిన అనంతరం తల్లిదండ్రులతో సమావేశం ఏర్పాటుచేసి, విద్యార్థుల ప్రగతిపై చర్చించడం జరుగుతుందన్నారు. బాలికల స్వీయ రక్షణ కోసం ఉచితంగా కరాటే తరగతులు నిర్వహించటం, క్రమశిక్షణ, నైతిక విలువలు పెంపొందించడం, గైడ్స్ ద్వారా శిక్షణ తరగతులు నిర్వహించడం చేస్తున్నామన్నారు. ప్రతి ఏడాది ఆయా తరగతిలో అధిక మార్కులు సాధించిన విద్యార్థులకు దాతల సహకారంతో బహుమతుల ప్రధానోత్సవం ఉంటుందన్నారు. ప్రతి తరగతిగదికి నిరంతరం విద్యుత్ సరఫరా, ఫ్యాన్లు, లైట్లు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. మానసికోల్లాసం కోసం ప్రతి రోజు సాయంత్రం క్రీడాపోటీలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించటం, స్కూల్ మేనేజ్మెంట్ కమిటీ, విద్యార్థుల తల్లిదండ్రుల సహకారంతో ఎన్నో ఏండ్ల చరిత్ర కలిగిన ముసునూరు గురుకుల పాఠశాల చదువులో తమ విద్యార్థులు ముందు ఉండటానికి గర్వకారణమని తెలిపారు. సువిశాలమైన ప్రాంగణంలో సుశిక్షితులైన ఉపాధ్యాయ సిబ్బందితో, ప్రభుత్వాధికారుల పర్యవేక్షణలో ఆదర్శ విద్యాభ్యాసం ఇక్కడే సాధ్యమవుతుందని తెలియజేశారు.



గురుకుల బాలికల పాఠశాల

ఘనంగా ప్రపంచ జనాభా దినోత్సవం


ఏలూరు సిటీలో..

ప్రజాశక్తి - చింతలపూడి

జనాభా అంశంపై ప్రపంచ దేశాలు రెండుగా విడిపోయాయని, కొన్ని దేశాలు ఇప్పటికే అధిక జనాభాతో ఉన్నట్లు భావించి నియంత్రణ చర్యలు పాటిస్తుండగా మరికొన్ని దేశాలు జనాభా పెరుగుదలకు ప్రోత్సాహకాలు ఇస్తున్నాయని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ పి.శ్రీనివాసరావు అన్నారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాల చింతలపూడిలో శుక్రవారం అర్థశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో ప్రపంచ జనాభా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో జనాభా నియంత్రణకు కఠినంగా అమలు చేసిన దేశాలు కూడా ఇప్పుడు ఆ నిబంధనలను సడలిస్తున్నాయని వివరించారు. అర్థశాస్త్ర విభాగాధిపతి డి.శంకర్ పోలయ్య మాట్లాడుతూ జనాభాను అంకెలపరంగా కాకుండా జనసాంద్రతపరంగా పరిశీలిస్తే కొన్ని దేశాలు సరైన ప్రణాళికతో ఎలా అభివృద్ధి పథంలో నడిచాయో తెలుస్తుందని, అధిక జన సాంద్రత ఉన్న సింగపూర్ సమర్థవంతమైన ప్రణాళిక ద్వారా ఆర్థిక, సామాజిక అభివృద్ధిని సాధించిందని వివరించారు. ఈ కార్యక్రమంలో అర్థశాస్త్ర అధ్యాపకులు డాక్టర్ ఎం.సుబ్బారావు, చరిత్ర అధ్యాపకులు డాక్టర్ ఎ.సంతోష్ రావు, పొలిటికల్ సైన్స్ అధ్యాపకులు కె.హరిప్రసాద్, విద్యార్థులు పాల్గొన్నారు.



ఆగిరిపల్లి : మాట్లాడుతున్న వైద్యాధికారి జగన్మోహనరావు

ఏలూరు సిటీ : ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ పిజె అమృతం ఆధ్వర్యంలో శుక్రవారం డిఎంహెచ్‌ఒ కార్యాలయం నుంచి పాత బస్టాండ్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పిజె అమృతం మాట్లాడుతూ ప్రణాళికాబద్ధమైన మాతృత్వం కోసం గర్భధారణల మధ్య ఆరోగ్యకరమైన సమయం పాటించాలన్నారు. తల్లి కావడానికి సరైన వయసు శారీరకంగా, మానసికంగా ఆరోగ్యంగా ఉండడానికి వివాహ వయసు ఆడవారికి 21 సంవత్సరాలు, మగవారికి 25 సంవత్సరాలు పాటించాలని తెలిపారు. బిడ్డ బిడ్డకు మధ్య గర్భం దాల్చడానికి కొంత సమయం తీసుకోవాలన్నారు. తల్లి బిడ్డ ఆరోగ్యంగా ఉన్నప్పుడే దేశం సౌభాగ్యంగా ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ శోభ, డాక్టర్ ప్రదీప్తి, ఇతర అధికారులు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

ఆగిరిపల్లి : జనాభా పెరుగుదల వల్ల కలిగే ప్రభావాలపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంపొందించుకోవాలని, జనాభా నియంత్రణ పట్ల అవగాహన కలిగివుండాలని ఆగిరిపల్లి ప్రాథమిక ఆరోగ్యకేంద్ర వైద్యాధికారి జె.జగన్మోహన్‌రావు అన్నారు. ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా ఆగిరిపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఆనంద మహిళా మండలి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంఇఒ-2 కె.ఆనంద్‌కమార్ మాట్లాడుతూ వేగవంతమైన జనాభా పెరుగుదల, దాని వల్ల కలిగే పరిణామాలను గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో ఆనంద మహిళా మండలి అధ్యక్షురాలు టి.సంధ్యారాని, కళాశాల ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ ఉమాదేవి, వైద్య సిబ్బంది, ఆశా వర్కర్‌లు పాల్గొన్నారు.

సామాజిక న్యాయం, సమానత్వమే లక్ష్యంగా పనిచేయాలి

జిల్లాపరిషత్ ఛైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ ప్రసాద్

ప్రజాశక్తి - ఏలూరు సిటీ


సర్టిఫికెట్స్ అందజేస్తున్న ఛైర్‌పర్సన్

మహిళల పాత్ర గ్రామీణ పరిపాలనలో కీలకమని, ప్రజా ప్రతినిధులందరూ సామాజిక న్యాయం, సమానత్వం లక్ష్యంగా పనిచేయాలని ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాపరిషత్ ఛైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ ప్రసాద్ పిలుపునిచ్చారు. జిల్లాలోని పంచాయతీ వనరుల కేంద్రం(డిపిఆర్‌సి)లో గత మూడు రోజులుగా నిర్వహించిన మహిళా సాధికారతతో సుపరిపాలన సాధ్యం అనే శిక్షణ కార్యక్రమంలో మండల పరిషత్ అధ్యక్షులు, జిల్లా పరిషత్ సభ్యులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఘంటా పద్మశ్రీ ప్రసాద్ విచ్చేసి మాట్లాడుతూ ఈ శిక్షణలో పాల్గొన్న ప్రజాప్రతినిధులు కూడా ఈ అవకాశాన్ని వినియోగించుకుని స్థానిక పరిపాలనలో తమ సామర్థ్యాన్ని పెంచుకోవాలని సూచించారు. అనంతరం మహిళలకు సర్టిఫికెట్స్ అందజేశారు. ఈ కార్యక్రమం మహిళల సాధికారత, జెండర్ సమానత్వం, ప్రజాపాలన వంటి అంశాలపై అవగాహన పెంపొందించే దిశగా విజయవంతంగా కొనసాగిందని అన్నారు.


ఉత్తమ విద్యార్థులకు సత్కారం

ప్రజాశక్తి - కొయ్యలగూడెం


విద్యార్థులను సత్కరించి మాట్లాడుతున్న హెచ్‌ఎం

పరింపూడి జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో 2024-25 విద్యా సంవత్సరంలో పదవ తరగతిలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు కొయ్యలగూడెం స్పందన స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో సత్కార కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పదిమంది విద్యార్థులకు కీర్తిశేషులు బ్రహ్మశ్రీ పెద్ది శేషయ్య శర్మ చారిటబుల్ ట్రస్ట్ తరఫున వారి కుమారులు ప్రసాద్ శర్మ, మనవడు శివ గణేష్ ఒక్కొక్క విద్యార్థికి రూ.వెయ్యి చొప్పున నగదు బహుమతి అందజేశారు. పాఠశాల హెడ్‌మాస్టర్ నిమ్మలూరి ఉమాదేవి మాట్లాడుతూ స్పందన సంస్థ ఏటా అందిస్తున్న ప్రోత్సాహం వల్ల విద్యార్థులు ఉత్తమ ప్రతిభను కనబరుస్తున్నారని సంస్థ సేవలను కొనియాడారు. కార్యక్రమంలో స్పందన స్వచ్ఛంద సేవా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు బలుసు నాగేశ్వరరావు, ఆర్.ప్రవీణ్‌కుమార్, కోశాధికారి ఎస్‌కె.జహంగీర్ పాల్గొన్నారు.

పలుచోట్ల 'సుపరిపాలనలో తొలి అడుగు'



ఏలూరు సిటీలో వృద్ధుడితో మాట్లాడుతున్న ఎంఎల్ఎ బడేటి చంటి

ప్రజాశక్తి - కుక్కునూరు

కూటమి ప్రభుత్వం తన ఏడాది పాలన పూర్తిచేసిన సందర్భంగా ప్రవేశపెట్టిన సుపరిపాలనలో తొలి అడుగు 4.1 కార్యక్రమంలో భాగంగా మండలంలోని రామాలయం సెంటర్‌లో శుక్రవారం టిడిపి అధ్యక్షుడు ములిశెట్టి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో ఇంటింటికీ తిరిగి ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రచారం చేశారు. తల్లికివందనం, దీపం పథకం, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, అన్నా క్యాంటీన్ల పునరుద్ధరణ, ఎన్‌టిఆర్ భరోసా పెన్షన్లు, యువతకు ఉద్యోగాలు, అన్నదాత సుఖీభవ, ఎస్‌సి వర్గీకరణ, బిసిల సంక్షేమం, అంగన్వాడీల సంక్షేమం, గుంతలు లేని రోడ్లు వంటి పథకాలను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు ములిశెట్టి నాగేశ్వరరావు, జనసేన ఉపాధ్యక్షుడు మొదుంపరపు వెంకన్నబాబు, సోషల్ మీడియా కన్వీనర్ గరక జగదీష్, ఉప సర్పంచి పిచుక రాజు, కుచర్లపాటి రమణ రాజు, అమరవరపు సాయి పాల్గొన్నారు.

ముసునూరు : సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా బూత్‌లో 95 శాతం కార్యక్రమాన్ని పూర్తి చేసుకున్న సందర్భంగా బూత్ కన్వీనర్‌లను సన్మానించినట్లు టిడిపి మండల అధ్యక్షులు గద్దె రఘుబాబు అన్నారు. శుక్రవారం మండలంలోని గుళ్లపూడి, గుడిపాడు, ముసునూరు, కాటేనీపాడు, చిల్లబోయినపల్లి గ్రామాల్లో టిడిపి అధికారంలోకి వచ్చి సంవత్సరకాలం పూర్తయిన సందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు గృహనిర్మాణ శాఖ, పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి ఆధ్వర్యంలో నిర్వహించే ఇంటింటికి సుపరిపాలన బూత్ స్థాయిలో 95 శాతం పూర్తి చేసిన కన్వీనర్లను సన్మానించినట్లు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో చిల్లబోయినపల్లి సర్పంచి కండేపు రామగిరిరావు, నియోజకవర్గ తెలుగు యువత కార్యదర్శి కొండేటి బాబి, టిడిపి మండల ప్రధాన కార్యదర్శి పాకనాటి సీతారాం, టిడిపి నాయకులు దేవినేని డలరామ్, గద్దల మోహనరావు, శ్రీధర్ బాబు, గార్లపాటి నరసింహారావు, అర్లప్ప, మండలపు ధర్మరాజు, కొల్లి గంగారం, సూర్యదేవర శ్రీనివాసరావు, రాపర్ల బాలకృష్ణ పాల్గొన్నారు.

దెందులూరు : సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా శుక్రవారం పెదవేగి మండలం జానంపేట, జగన్నాథపురం, కవ్వగుంట, ఒంగూరు గ్రామాల్లో ఎంఎల్ఎ చింతమనేని ప్రభాకర్ పర్యటించారు. తమ గ్రామానికి విచ్చేసిన ఎంఎల్ఎకు వాడవాడలా ప్రజలు ఎంతో అభిమానాన్ని చూపుతూ పూలమాలలతో, మహిళల మంగళ హారతులతో స్థానిక కూటమి నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తుల ఆధ్వర్యంలో ఘన స్వాగతం పలికారు. గ్రామాల్లో ఇంటింటికి వెళ్లి కూటమి ప్రభుత్వం అందిస్తున్న అభివృద్ధి, సంక్షేమ పాలనను ప్రజలకు వివరిస్తూ కరపత్రాలను పంపిణీ చేశారు. అదేవిధంగా ప్రజలకు ఏమైనా సమస్యలు ఉన్నాయా అనే అంశాన్ని కూడా తెలుసుకుంటూ, వాటిని నమోదు చేసుకుంటూ సత్వరమే వాటిని పరిష్కరించేలా చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులకు ఆదేశాలను సైతం జారీచేశారు.


దెందులూరులో ఎంఎల్ఎకు స్వాగతం పలుకుతున్న మహిళలు

ఏలూరు సిటీ : ఏలూరు అసెంబ్లీ నియోజకవర్గంలో నెలకొన్న స్థానిక సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టిసారించినట్లు ఏలూరు ఎంఎల్ఎ బడేటి చంటి అన్నారు. స్థానిక 4వ డివిజన్ మస్తాన్ మన్యం కాలనీలో శుక్రవారం ఎంఎల్ఎ పర్యటించారు. అనంతరం డివిజన్‌లోని ఇంటింటికీ వెళ్లిన ఎంఎల్ఎ స్థానికుల నుంచి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కూటమి ప్రభుత్వం అమలు చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరించారు. ఈక్రమంలో గతకొద్ది రోజులుగా డివిజన్‌లోని డ్రెయిన్‌లలో సిల్టు తొలగింపు పనులు జరగడం లేదనే విషయాన్ని పలువురు స్థానిక మహిళలు ఎంఎల్ఎ దృష్టికి తీసుకురాగా ఈ అంశంపై స్పందించిన ఆయన అవసరమైతే అదనపు సిబ్బందిని పెట్టి యుద్ధప్రాతిపదికన డ్రెయిన్‌లను శుభ్రం చేయిస్తానని మహిళలకు హామీ ఇచ్చారు. ఇంకోపక్క మున్సిపల్ అధికారులు, శానిటేషన్ సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తంచేశారు. డివిజన్‌లో ఇటువంటి పరిస్థితులు నెలకొంటే నిద్రపోతున్నారా అని అధికారులను ప్రశ్నించారు. సమస్యకు తక్షణ పరిష్కారం చూపకుంటే చర్యలు తీవ్రంగా ఉంటాయని ఆయన హెచ్చరించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అమలు చేస్తోన్న సంక్షేమ కార్యక్రమాలు ఈ ప్రాంతంలోని ప్రజలకు పుష్కలంగా అందుతున్నాయన్నారు. డ్రెయిన్‌లు, రోడ్ల నిర్మాణాలను కూడా ప్రాధాన్యతా క్రమంలో నిర్మిస్తామని భరోసా ఇచ్చారు. డ్రెయిన్‌లపై ఆక్రమణలను తొలగించాలని అధికారులను ఆదేశించామన్నారు. దానిద్వారా నీటిపారుదల సక్రమంగా జరుగుతుందని, సిల్టు తొలగింపునకు కూడా అడ్డంకి ఉండదన్నారు. రానున్న రోజుల్లో సమస్యలన్నింటికీ మోక్షం కల్పిస్తామని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మాలల ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ దాసరి ఆంజనేయులు, ఈడా ఛైర్మన్ పెద్దిబోయిన శివప్రసాద్, ఏలూరు ఎంఎంసి ఛైర్మన్ మామిళ్లపల్లి పార్థసారథి, మాజీ మున్సిపల్ ఛైర్మన్ ఉప్పాల జగదీష్ బాబు, కో ఆప్షన్ సభ్యులు ఎస్ఎంఆర్ పెదబాబు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

ప్రజాశక్తి - ముదినేపల్లి

విద్యుత్ మరమ్మతులు కారణంగా శనివారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు 33/11 కెవి చిగురుకోట సబ్ స్టేషన్ పరిధిలోని విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు విద్యుత్ శాఖ గుడివాడ డివిజన్ ఇంజనీర్ జిబి.శ్రీనివాసరావు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. గృహ, వాణిజ్య, ఆక్వా, విద్యుత్ వినియోగదారులు, ఆయా గ్రామాల ప్రజలందరూ సహకరించవలసిందిగా శ్రీనివాసరావు కోరారు.

'ప్రధాన కేంద్రాలుగా మినీ అంగన్వాడీ కేంద్రాలు'

ప్రజాశక్తి - మండవల్లి

మినీ అంగన్వాడీ కేంద్రాలు ప్రధాన కేంద్రాలుగా మారనున్నాయని సిడిపిఒ దీప్తి ఒక ప్రకటనలో తెలియజేశారు. అంగన్వాడీలకు ఇచ్చిన హామీని నెరవేరుస్తూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తీసుకున్న నిర్ణయంతో కైకలూరు సిడిఎస్ ప్రాజెక్ట్ పరిధిలో 15 మినీ అంగన్వాడీలకు ప్రయోజనం చేకూరనుందని ఆమె పేర్కొన్నారు. దీంతో మినీ అంగన్వాడీ కేంద్రాలు ప్రధాన కేంద్రాలుగా మార్చడంతో రూ.7,500 వేతనం తీసుకున్న కార్యకర్త ప్రధాన కేంద్రంగా మార్చడంతో రూ.11,500 జీతం అందుతుందని తెలిపారు. అంతేకాకుండా ఖాళీగా ఉన్న అంగన్వాడీ కార్యకర్తల పోస్టులకు భర్తీ చేయడం జరుగుతుందని, మరికొంత మందికి ఉపాధి చేకూరుతుందని ఆమె తెలియజేశారు.

ఎంఎల్ఎకు న్యాయవాదుల వినతి

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

చింతలపూడి నియోజకవర్గ ఎంఎల్ఎ సొంగా రోషన్ కుమార్‌ని జంగారెడ్డిగూడెం బార్ అసోసియేషన్ న్యాయవాదులు శుక్రవారం కలిశారు. న్యాయస్థానాలకు పక్కా బిల్డింగ్స్ రాష్ట్ర ప్రభుత్వం నుంచి కేటాయించాలని కోరుతూ వినతిపత్రం సమర్పించారు. 2014 నుంచి 2019 వరకు టిడిపి ప్రభుత్వ హయాంలో జంగారెడ్డిగూడెం న్యాయస్థానాలకు మూడెకరాల 33 సెంట్లు స్థలాన్ని కోర్టు పేరు మీద మంజూరు చేశారు. అదేవిధంగా ప్రస్తుతం కూటమి ప్రభుత్వంలో న్యాయస్థానాల పక్కా బిల్డింగ్స్ సముదాయాలు నిర్మించడానికి తమ వంతు చర్యలు తీసుకోవలసిందిగా వినతి పత్రంలో కోరారు. జంగారెడ్డిగూడెం న్యాయస్థానాలకు 7 మండలాల అర్జీదారులు హాజరవుతున్నట్లుగా ఎంఎల్ఎ తెలియజేశారు. ఎంఎల్ఎను కలిసిన వారలలో బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు మోడేపల్లి నాగులు, బార్ అసోసియేషన్ ట్రెజరర్ మానికల సూరిబాబు, సీనియర్ న్యాయవాదులు పొన్నా లక్ష్మణరావు, పాములపాటి కృష్ణారెడ్డి, నిమ్మగడ్డ రాంబాబు పాల్గొన్నారు.

వరద బాధితులకు సమగ్ర పునరావాసం కల్పించాలి

కుక్కునూరు : జూన్, జులై నెలల్లో గోదావరి వరదలతో మునిగే గ్రామాల నిర్వాసితులకు పునరావాస కాలనీల్లో ఉపాధి, నిర్మాణ విలువ, 45.72 కాంటూరు భూముల విషయంలో సమాధానం లేకుండా ఖాళీ చేయమనడాన్ని సిపిఐ(ఎంఎల్) జిల్లా కార్యదర్శి ఎస్‌కె.గౌస్ ప్రశ్నించారు. వరద బాధితులకు సమగ్ర పునరావాసం కల్పించాలని డిమాండ్ చేశారు. మండలంలోని నెమలిపేటలో మండల కార్యదర్శి కంగాల కల్లయ్య అధ్యక్షతన సిపిఐ(ఎంఎల్) ప్రజాపంథా ముఖ్య కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో జిల్లా కార్యదర్శి ఎస్‌కె.గౌస్ మాట్లాడారు. జిల్లా నాయకులు ఎస్‌కె.మున్ని, మండల నాయకులు పి.బాబురావు, కె.ముత్యాలు, ఎం. వెంకటేశ్వర్లు, పి.వీరయ్య పాల్గొన్నారు.

ఘనంగా ఎంప్లాయీస్ యూనియన్ ఆవిర్భావ దినోత్సవం

నూజివీడు టౌన్ : ఎంప్లాయీస్ యూనియన్ 74వ ఆవిర్భావ దినోత్సవంను శుక్రవారం నూజివీడు ఆర్‌టిసి బస్ డిపో వద్ద ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంప్లాయిస్ యూనియన్ రీజనల్ నాయకులు రంగు శ్రీనివాసరావు జెండా ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. రీజనల్ నాయకులు ఎం.గంగాధర్ యూనియన్ పోరాటాల గురించి, సాధించిన విజయాలు సభ్యులకు వివరించారు. డిపో సెక్రటరీ ఇవి.కుమార్, ట్రెజరర్ పిఎస్.రావు, జాయింట్ సెక్రటరీ ఎంఎస్.కుమార్ పాల్గొన్నారు.